# విజయం

**ఆకునూరి మురళీకృష్ణ**

"మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్?"

పెళ్ళిచూపులకొచ్చి, ఆ తతంగమంతా పూర్తయ్యాక తనతో ఒంటరిగా మాట్లాడాలని అందరినీ ఆ గదిలోంచి పంపించేసి పది నిమిషాల పాటు రకరకాల విషయాలు మాట్లాడి సమావేశం ఇంక ముగుస్తున్న సమయంలో ఏదో గుర్తుకొచ్చిన వాడిలా సడెన్‌గా అతడు అడిగిన ఆ ప్రశ్నకి తలెత్తి అతడివైపు విసుగ్గా చూసింది లక్ష్మి. పేరు తెలియకుండానే పెళ్ళిచూపులకొచ్చేశాడా? పేరు తెలుసుకోకుండానే ఇంత సేపు మాట్లాడాడా?

కళ్లెత్తి అతనివైపలాగే చూస్తూ సమాధానం చెప్పడం ఒక్క క్షణం ఆలస్యం చేసింది. ఆ కాస్త సమయంలోనూ ఆమె ముఖంలోని భావాలు అతడి మెదడుని చేరగలగడంతో వరుణ్ సిగ్గుపడుతున్నట్లు కదిలాడు కుర్చీలో. సిగ్గుపడుతూనే భుజాలెగరేస్తూ కుర్చీలో కొంచెం ముందుకు వాలి నవ్వేడు స్టైల్‌గా. చేతులు ఊపుతూ ఆమెని శాంతింపచేస్తున్నట్లుగా అన్నాడు.

"తప్పే...తప్పే... పేరు తెలుసుకోకుండా పెళ్లిచూపులకి వచ్చేయడం తప్పే. కానీ... చెప్పాను కదా... అయాం నాట్ దట్ మచ్ ఆర్గనైజ్డ్ పర్సన్. దటీజ్ మై నేచర్. అసలు కారు మీ ఇంటి సందు మలుపు తిరిగే వరకూ పెళ్లిచూపులకొస్తానో రానో నాకే గ్యారంటీగా తెలియదు. అంత మూడీ ఫెలోని! అమ్మ చూపిస్తే ఇంటి దగ్గర మీ ఫోటో చూశాను. ఇక్కడ అందరూ గోలగోలగా..." అంటూ మళ్లీ ఆమె ముఖం చూసి ఆగి నొచ్చుకుంటున్నట్లుగా "సారీ... సారీ... ఐ మీన్ జనం ఎక్కువైపోయారు కదా. ఒకే ప్రశ్నకి చాలామంది సమాధానం చెప్పారు. వాళ్లు చెప్పిన విషయాలన్నీ క్రోడీకరించుకుంటే మీ వివరాలు అర్థమయ్యాయి కానీ అందరూ మిమ్మల్ని మా పెద్దమ్మాయనో, పెళ్లికూతురనో పరిచయం చేశారు తప్ప మీ పేరు ఎవరూ చెప్పలేదు" అన్నాడు సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లుగా.

అతడు చెబుతున్న విధానానికి ఆమెకి నవ్వొచ్చింది. అప్పటిదాకా అతడు మాట్లాడిన మాటలనీ తనని చూస్తున్నపుడు అతడి కళ్లలో కనిపిస్తున్న మెరుపుని చూస్తుంటే అతడికి తను నచ్చిందన్న విషయం తెలుస్తూనే ఉంది. అతడు కూడా ఆమెకి నచ్చాడు.

"సో... మీ పేరేమిటో చెబుతారా?"

"లక్ష్మి" అంది చిన్నగా నవ్వుతూ.

ఆమె సమాధానం విన్నాక అతడి ముఖంలో చిన్నపాటి నిరాశ. అదీ క్షణం సేపు మాత్రమే. మరుక్షణమే మళ్లీ నవ్వుతూ అన్నాడు "లక్ష్మి... మోస్ట్ కామన్ నేమ్. మా ఆఫీసులో ముగ్గురు లక్ష్ములు ఉన్నారు. మా ఫేమిలీలో అయితే లెక్ఖే లేదు. నాకు అన్ని వరసల్లోనూ లక్ష్ములున్నారు" అంటూ నవ్వబోయి ఆమె ముఖం చూసి ఆగాడు.

"ఐ మీన్... ఇంత ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్న మీకు అంత ఆర్డినరీ పేరేమిటా అని..."

ఈసారి అతడామెకి పూర్తిగా నచ్చేడు. తన మనసులోని భావం మాటగా మారకముందే ముఖంలో చదివేసి సర్దుకుపోయి తనని సముదాయించాలని ప్రయత్నిస్తున్న అతన్ని చూస్తుంటే ఆమెకి సహజంగానే ఇష్టం కలుగుతోంది. అతని పొగడ్తకీ, పొగుడుతున్నపుడు గొంతులో కదలాడిన సిన్సియారిటీకి ఆమె కోపం శాంతంగా మారిపోయింది.

"ఒకే...ఒకే... ఐ డోంట్‌మైండ్. పెళ్లయ్యాక నేను మిమ్మల్ని నాకు నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు కదా?" అన్నాడు అతను అల్లరిగా నవ్వుతూ.

అతడి మాటలు ఆమె పూర్తిగా వినలేదు... "పెళ్లయ్యాక" అన్న పదం దగ్గరే ఆమె ఆలోచనలు ఆగిపోయాయి. ఆ మాటలకి యెదలో మంగళవాయిద్యాలు మ్రోగుతున్నట్లనిపించి శరీరం పులకించింది.

ooo

"లక్ష్మి తప్ప ఇంకేం పేర్లు దొరకలేదా మా అమ్మా వాళ్లకి? ఇంత రొటీన్‌గా నాకీ పేరెందుకు పెట్టారో?" వదిన హరితతో విసుగ్గా అంది లక్ష్మి బుంగ మూతి పెట్టుకుని.

హరిత నవ్వింది. "లక్ష్మీకళ ఉట్టిపడుతూ పుట్టావు కనుక నీకు లక్ష్మి అన్న పేరు సరిపోతుందనుకున్నట్లున్నారు. నాకు కూడా అదే కరెక్టనిపిస్తోంది. అయినా ఎప్పుడూ లేనిది ఇప్పుడు నీకెందుకొచ్చిందీ ఆ అనుమానం?"

"వరలక్ష్మి... రాజ్యలక్ష్మి... సుబ్బలక్ష్మి మన ఆంధ్రదేశంలో ఎక్కడ చూసినా లక్ష్మిలే. అలాంటి పాత చింతకాయ పచ్చడి లాంటి పేరు కాకుండా నాకేమైనా కాస్త వెరైటీగా ఉండే పేరు పెట్టి ఉండచ్చు కదా?" అంది లక్ష్మి.

"కళ్లు పోతాయి. కుటుంబంలో పుట్టిన మొదటి ఆడపిల్లకి లక్ష్మీదేవి పేరు పెట్టుకోవడం మన తెలుగువారి సంప్రదాయం. అయినా పెళ్లయ్యాక అమెరికా వెళ్లిపోతావు కదా? అక్కడీ పేరు అల్ట్రా మోడ్రన్‌గానే ఉంటుందిలే" అంది హరిత మరదలి నెత్తిమీద చిన్నగా కొడుతూ మురిపెంగా.

"అమెరికా వెళ్లడమేమిటి?" అంది లక్ష్మి అర్థం కానట్లుగా.

"వరుణ్‌కి అమెరికాలో ఉద్యోగం వచ్చిందట" అంది హరిత ఆమెకి కొత్త విషయాన్ని చెబుతున్నట్లుగా.

"వరుణ్ ఎవరూ?" అంది లక్ష్మి.

"అంత నటించద్దమ్మా" అంది హరిత నవ్వేస్తూ. ఆ మాటలకి సిగ్గుపడుతూనే నవ్వింది లక్ష్మి.

"మీరిద్దరూ ఒకరికొకరు బాగా నచ్చారన్న సంగతి మాకు పెళ్లిచూపుల రోజే అర్థమైంది. మీ అన్నయ్యకి ఫోన్ చేసి నువ్వు నచ్చావన్న విషయం చెబుతూ అమెరికాలో వరుణ్‌కి కొత్త ఉద్యోగం వచ్చిందన్న విషయం కూడా చెప్పారుట వాళ్లు. మావయ్యగారు, మీ అన్నయ్య మాట్లాడటానికి వెళ్లారు వాళ్లింటికి."

లక్ష్మి సంభ్రమంగా చూసింది వదిన వైపు.

ooo

"వాళ్లు చాలా మర్యాదస్తుల్లా ఉన్నారు. అన్ని విషయాలు మనం చెప్పినదానికి తలూపారే తప్ప మరో మాట మాట్లాడలేదు. అమ్మాయి పేరు విషయంలో మాత్రం వాళ్లు కొంచెం పర్టిక్యులర్‌గా అన్నారు. పెద్ద వాళ్ల కన్నా అబ్బాయికెక్కువ కోరికగా ఉన్నట్టుంది" అన్నాడు రామారావు నవ్వుతూ భార్య సుగుణతో.

"లక్షణంగా లక్ష్మీకళ ఉట్టిపడుతున్న పేరునెలా మార్చేస్తామండీ?" నిరసన వ్యక్తం చేస్తూ అంది సుగుణ.

"అన్ని విషయాల్లోనూ వాళ్లంత చూసీ చూడనట్లు ఉన్నపుడు వాళ్లు అడుగుతున్న ఈ ఒక్క విషయంలో మనం బెట్టు చేయడం బాగోదని నేనూ ఊరుకున్నాను. పేరు తప్ప అన్ని విషయాల్లోనూ మోడ్రన్‌గా మా వాడు కోరుకున్నట్లుగా ఉంది మీ అమ్మాయి. పేరు కూడా వాడికి నచ్చినట్లుగా ఉంటే ఈ అసంతృప్తి లేకుండా వాళ్ల దాంపత్యం సుఖంగా సాగిపోతుందని వాళ్లు నన్ను కన్విన్స్ చేయాలని ప్రయత్నిస్తుంటే నేనేం మాట్లాడలేకపోయాను"

"ఇందులో అంత ఆలోచించాల్సిందేముందిరా? నేను మార్చుకోలేదూ పేరు? వాళ్ల శుభలేఖలో వాళ్లకి నచ్చిన పేరు వేసుకుంటారు. మన శుభలేఖలో మనం పెట్టిన పేరు వేసుకుంటాం" అంది రామారావు తల్లి సీతమ్మ.

సుగుణ అత్తగారివైపు సాలోచనగా చూసింది. అత్తగారిని తమ వైపు బంధువులు ఒక పేరుతోనూ, ఆవిడ పుట్టింటి తరపు బంధువులు మరో పేరుతోనూ పిలవడం అందరికీ తెలిసిందే.

"మీ రోజుల్లో అదేం పెద్ద ప్రోబ్లం కాదమ్మా. కానీ

ఇప్పుడు దాని పేరు మార్చుకోవాలంటే గెజిట్‌లో నోటిఫికేషన్ ఇచ్చి కాలేజి వాళ్ళకీ యూనివర్సిటీ వాళ్ళకీ అందరికీ ఉత్తరాలు రాయాలి. అదో పెద్ద తతంగం"

"అయినా దీని పేరు బాగోలేదన్న వాళ్లని వీళ్లనే చూస్తున్నాను" అంది సుగుణ.

''బాగోలేదని కాదు... అతడికి నచ్చినట్లుగా, మోడ్రన్‌గా లేదని. ఈ కాలం పిల్లల ఆలోచనలు ఎలా ఉంటున్నాయో నీకు తెలియదు సుగుణా... జీవితంలో ఏ చిన్న అసంతృప్తినీ వాళ్లు భరించలేకపోతున్నారు. ఎందుకు అడ్జస్ట్ అవ్వాలన్న పట్టుదలతో వాళ్లకి కావాల్సింది సాధించుకుంటున్నారు. మనలా సర్దుకుపోయే తరం కాదిది" అన్నాడు రామారావు.

○○○


"ఏమిటి మీరంటున్నది? నేను పేరు మార్చుకోవాలా? ఎందుకు?" ఆశ్చర్యంగా అంది లక్ష్మి.

"అవునమ్మా... వాళ్లకి మన సంబంధం అన్ని విధాలా నచ్చిందట. కానీ ఒక్క నీ పేరే పాతగా ఉందని, మార్చుకుంటే బావుంటుందని అబ్బాయి అనుకుంటున్నాడని వాళ్లన్నారు. పెళ్లిచూపుల్లో నీతో మాట్లాడినపుడు ఆ అబ్బాయి ఆ విషయం చెప్పాడుట కదా?" అన్నాడు రామారావు.

లక్ష్మి ఆశ్చర్యంగా చూసిందాయన వంక. అప్పుడు గుర్తుకు వచ్చాయి ఆమెకి అతడన్న చివరి మాటలు. పెళ్లయ్యాక నిన్ను నాకు నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు కదా? అన్నాడు. అంత మోజుగా ఉన్నప్పుడు ఏ పేరుతో పిలిస్తేనేంలే అనుకుంది. కానీ ఇప్పుడు ఏకంగా పేరే మార్చుకోమంటున్నారే? బాగా ఆలోచిస్తుంటే ఆమెకి అర్థమవుతోంది... ఆ రోజు అతడన్నదానికీ, ఇప్పుడు వాళ్లు అడుగుతున్నదానికీ పెద్దగా తేడా ఏం లేదు.

"అతడన్నదాంట్లో కూడా తప్పేం లేదు. జీవితాంతం కలిసుండే భార్య పేరు తనకి నచ్చినట్లుగా ఉండాలనుకున్నాడు. అంతే కదా? అందులో తప్పేముంది?"

"పాత చింతకాయపచ్చడిలా నాకీ పేరెందుకు పెట్టారు అని ఇందాకటి నుంచీ తెగ బాధపడిపోతున్నావుగా? ఇంకేం? గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. హాయిగా అతడికి నచ్చిన పేరు



పెట్టేసుకో" ఎవరికీ వినపడకుండా లక్ష్మి చెవిలో గుసగుసలాడింది హరిత.

"నాకు పేరు మార్చుకోవడం ఇష్టం లేదు నాన్నా!" స్థిరంగా చెప్పింది లక్ష్మి.

ఆ మాటలకి హరితతో సహా అందరూ ఆశ్చర్యంగా చూశారు లక్ష్మి వంక.

"నాకు ముందీ సంగతి స్పష్టంగా చెప్పు? నీకు అతడు నచ్చేడా లేదా? అతడ్ని పెళ్లి చేసుకోవడం ఇష్టమా కాదా?" అడిగాడు రామారావు నెమ్మదిగా.

"నచ్చాడని చెప్పాను కదా నాన్నా" అంది లక్ష్మి విసుగ్గా.

"మాకు కూడా ఈ సంబంధం అన్ని విధాలా నచ్చింది. అన్నీ అందరికీ నచ్చినప్పుడు కేవలం చిన్న విషయంలో అంతలా పంతం పట్టి కూర్చోవడం మంచిది కాదు. జీవితంలో కొన్ని కొన్ని విషయాలకి సర్దుకుపోవడం అలవాటుచేసుకోవాలి" అన్నాడు రామారావు కొంచెం సీరియస్‌గా.

"నిజమే నాన్నా కానీ నేను సర్దుకుపోలేకపోతున్నాను. కేవలం అతడ్ని పెళ్లి చేసుకోవడం కోసం పేరు మార్చుకునేందుకు నేను సిద్ధంగా లేను" అంది లక్ష్మి కరాఖండిగా.

కూతురివైపు నీరసంగా చూస్తున్న రామారావుని చూసి నవ్వుతూ అంది సుగుణ.

"మీరే అన్నారుగా... సర్దుకుపోయే తరం కాదిది అని? ఇది కూడా ఈ తరంలో పుట్టిన పిల్లే మరి?"

○○○

"నాకీ చెత్త పేరెందుకు పెట్టారని విసుక్కున్నావు కదా? ఇప్పుడు అతను అడుగుతుంటే పేరు మార్చుకోవడం ఇష్టం లేదంటావేంటి? అన్నింటికీ ఒప్పేసుకుంటే లోకువైపోతావని భయమా?" అడిగింది హరిత లక్ష్మిని ఎవరూ లేని సమయంలో.

"నాకింతకన్నా లేటెస్ట్ పేరుండి ఉంటే అతనికి నచ్చేది కదా అన్న ఉద్దేశంతో అలా అన్నాను. దాని అర్థం అతనికి నచ్చినట్టుగా నా పేరుని మార్చుకుంటానని కాదే?" అంది లక్ష్మి.

"పెళ్లి కాలేదు కనుక ఇప్పుడీ విషయానికింత పంతం పడుతున్నావు కానీ పెళ్లయ్యాక ఇలాంటివన్నీ ఎంతో కామన్ అయిపోతాయి. మనం ప్రేమించే వాళ్ల కోసం, మనల్ని ప్రేమించే వాళ్ల కోసం మనల్ని మనం మార్చుకోవడం తప్పనిసరి..."

లక్ష్మి మాట్లాడలేదు.

"ఆడవాళ్లు చిన్న చిన్న విషయాల్లో సర్దుకోకపోతే సంసారాలు గడవవు లక్ష్మీ. అంతెందుకు? నన్నే తీసుకో... పెళ్లికి ముందు నేను వేరు. పెళ్లయ్యాక నేను వేరు. మీ అన్నయ్య కోసం నాకు తెలియకుండానే నేను పూర్తిగా మారిపోయాను. మీకు తెలియకపోవచ్చు కానీ పెళ్లికి ముందు నా గురించి బాగా తెలిసిన వాళ్లకి మాత్రం ఆ తేడా స్పష్టంగా తెలుస్తుంది. నేనే కాదు ప్రతి స్త్రీ జీవితంలోనూ తప్పనిసరి పరిణామమే ఇది. నువ్వు చేస్తున్నది తెలివైన పని కాదనిపిస్తోంది నాకు" అంది హరిత లక్ష్మికి నచ్చచెబుతున్న ధోరణిలో.

ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరికి నువ్వు లొంగాల్సిందే అన్న హెచ్చరిక కనబడింది లక్ష్మికి ఆమె మాటల్లో. దానిని గ్రహించి చిన్నగా నవ్వుతూ అంది.

"నా ఉద్దేశం కూడా అదే. సంసారాలు సజావుగా సాగాలంటే మనం మారాలి కరెక్టే. కానీ అలా మారినందుకు మనం బాధపడుతున్నామంటే మన సంసారం సజావుగా సాగడం లేదనే అర్థం."

బాగా ఆలోచిస్తే కానీ ఆమె మాటల్లోని లోతు అర్థం కాలేదు హరితకి.

ooo

"నేను... లక్ష్మిని మాట్లాడుతున్నాను" అంది లక్ష్మి వరుణ్‌కి ఫోన్ చేసి.

వరుణ్ వెంటనే గుర్తు పట్టాడు. "వాట్ సర్‌ప్రయిజ్?" అన్నాడు ఆనందంగా.

కాసేపు మామూలు మాటలయ్యాక అన్నాడు అతను "మీ ఫాదర్ అన్ని విషయాలూ చెప్తే ఉంటారను కుంటాను. మీరు బాగా నచ్చారు. ఒక్క మీ పేరే... కొంచెం మోడ్రన్‌గా ఉంటే బాగుంటుందనిపించింది. అందుకే అలా అన్నాను."

"నేను కూడా ఆ విషయమే చెబుదామని ఫోన్ చేశాను. మీరు నాకు బాగా నచ్చారు. ఒక్క నా పేరు మార్చుకోమని అడగడమే నచ్చలేదు" అంది లక్ష్మి.

అతడొక్క క్షణం తడబడ్డాడు.

"ఐ మీన్... మీకు ఆ రోజే చెప్పాను కదా? మా సర్కిల్లో చాలామంది లక్ష్మిలున్నారని? కన్‌ఫ్యూజ్ అయ్యే ఛాన్స్ ఉంది. అదీగాక నాకు మోడరన్ పేర్లు అంటే ఇష్టం" అతని గొంతు కోపంగా కాక కన్విన్స్ చేస్తున్నట్లు ఉండడం ప్రొఫెషనలిజం కాదని. అతని స్వభావమేనని పసిగట్టిన లక్ష్మికి తను ఫోన్ చేసి తప్పు చేయలేదనిపించింది.

"మీ సర్కిల్లో అంతమంది లక్ష్మిలున్నా ఫోన్ చేయగానే నేనే అని ఎలా గుర్తుపట్టారు?" అంది.

అతడు మాట్లాడలేదు.

"పేరు మార్చుకోవడం నాకు ఇష్టం లేదు."

"ఇందులో అంత ఫీలవ్వాల్సిందేముంది? సపోజ్ ఇప్పుడు మనం కలవబోతున్నామనుకోండి? మీకిష్టమైన కలరేమిటో తెలుసుకుని ఆ రంగు డ్రెస్ నేను వేసుకుని వస్తాను. అలాగే ఇదీనూ" తన వాదనకి బలాన్ని చేకూరుస్తూ అన్నాడతను.

లక్ష్మి నవ్వింది. "డ్రెస్ వేరు, పేరు వేరు, సపోజ్ నాకు సుబ్బారావన్న పేరు ఇష్టమనుకోండి. నేను మిమ్మల్ని ప్రేమగా దగ్గరకి తీసుకుని 'ఐ లవ్ యూ సుబ్బారావ్' అంటే మీకెలా ఉంటుంది? నాకు ఇష్టమని సర్దుకుపోగలరా?"

కనిపించకపోయినా అతడి ముఖంలోకి భావాలని అంచనా వేయగలిగింది లక్ష్మి. వస్తున్న నవ్వునాపు కుంటూ చెప్పింది.

"ఎదుటి వాళ్ల ఇష్టాలని గౌరవించడం వేరు... వాటి కోసం మన వ్యక్తిత్వాన్ని చంపేసుకోవడం వేరు వరుణ్. అది ఆదర్శవంతమైన సహజీవనం అనిపించుకోదు. ఇప్పుడు నా గురించి మీకు తెలిసిన వివరాలు కొన్నే కనుక వాటిల్లో మీకు నచ్చని ఒక్క విషయాన్నీ మార్చేసుకుంటే మీరు నన్ను పరిపూర్ణంగా ఇష్టపడచ్చు అనుకుంటున్నారు. కానీ మనం కలిసి జీవించడం మొదలుపెడితే మీ గురించి నాకు, నా గురించి మీకు ఇప్పుడు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయి. వాటిలో ఇంకా ఎన్నో విషయాలు మనకి నచ్చచ్చు. కొన్ని నచ్చకపోవచ్చు కూడా. వాటన్నిటికీ మానసికంగా సిద్ధపడే మనం సంసార జీవితాన్ని ప్రారంభించాలి. అంతేకానీ ఎదుటివాళ్లలో నచ్చని ప్రతి విషయాన్నీ మనకి నచ్చినట్లుగా మార్చేసుకోవాలంటే మన మధ్య యుద్ధం తప్పదు. ఆ యుద్ధంలో ఎవరు గెలిస్తే వాళ్లకి నచ్చినట్లుగా సంసారం సాగుతూ రెండోవాళ్లు వ్యక్తిత్వాన్ని పూర్తిగా కోల్పోవాలి. తరతరాలుగా మనం చూస్తున్న చాలా సంసారాల్లో జరుగుతున్నదిదే. మన సంసారం కూడా అలాంటి మూసలో సాగడం నాకిష్టం లేదు వరుణ్...భార్యాభర్తలు సఖ్యంగా ఉండాలంటే వాళ్లలో ఒకరు తమ వ్యకిత్వాన్ని చంపేసుకోనక్కర్లేదు. సంసారం కోసం అంత పెద్ద త్యాగం అఖ్ఖర్లేదన్న నిజాన్ని మాత్రం ఇద్దరూ గ్రహిస్తే చాలు. ఆ సహజీవనం స్వర్గంలా ఉంటుంది. పెళ్లికి ముందే మీకిదంతా చెప్పాలని ఫోన్ చేస్తున్నాను"



## మాధురి వచ్చేస్తోంది!

ఒకప్పుడు తన డాన్సులు, నటన, గ్లామర్‌తో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న మాధురీ దీక్షిత్ పెళ్లి చేసుకుని, ఇద్దరు పిల్లల్ని కంది. కొంత కాలం గ్యాప్ తర్వాత తిరిగి ఆమె నటిస్తున్న *'ఆజా నచ్‌లే'* సినిమా ఈ నవంబర్ 30న విడుదల కాబోతోంది. నలభయ్యేళ్ల వయసులో హీరోయిన్‌గా తన పూర్వవైభవాన్ని మాధురి సొంతం చేసుకోకపోయినా కమర్షియల్‌గా నిర్మాతలకు ఎంత లాభం తెచ్చిపెట్టగలదు? అని బాలీవుడ్ సినీ పండితులు లెక్కలు వేస్తున్నారిప్పుడు. మాధురి తన సెకండ్ ఇన్నింగ్స్ సక్సెస్ అవుతుందనే ఆశాభావంతోనే వుంది. సహజమేగా!

ఫోన్లో వినిపిస్తున్న ఆమె గొంతుని వింటూ అలాగే ఉండిపోయాడు వరుణ్. ఇది మొదలు మాత్రమే అని తెలుస్తూనే ఉంది... కానీ ఆమె చెప్పిన రీజనింగ్ అతన్ని కన్విన్స్ చేస్తోంది.

"ఇప్పుడు చెప్పండి... పేరు మార్చుకోని నేను మీకిష్టమైతే మీతో పెళ్లికి నేను సిద్ధమే!" అంది.

వరుణ్ కాసేపేమీ మాట్లాడలేదు.

లక్ష్మి ఇంక ఫోన్ పెట్టెయ్యబోతుంటే అప్పుడు అన్నాడు.

"శుభలేఖల్లో వేయించడానికి మా వాళ్లకి చెప్పాలి. చెప్పండి. మీ పూర్తి పేరేమిటంటకీ? సుబ్బలక్ష్మా? వరలక్ష్మా? భాగ్యలక్ష్మా?"

ఎంత వద్దనుకున్నా అతని గొంతులో ఉడుకుమోతుతనం తెలిసిపోతూనే ఉంది.

అతన్నింకా ఉడికిస్తూ చిన్నగా నవ్వుతూ అంది లక్ష్మి. "అవేమీ కాదు... విజయలక్ష్మి!!"

o